ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024 | 5 | కర్నూలు





పోలీస్ అమరవీరుల స్థూపానికి సెల్యూట్ చేసి నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్‌పి

తమ్ముళ్ల దౌర్జన్యం

- మద్యం దుకాణ నిర్వాహకులకు టిడిపి నేతల బెదిరింపులు
- వాటా ఇవ్వకుంటే తెరుచుకోనివ్వమని హెచ్చరికలు
- అధినేత హెచ్చరించినా.. మారని తీరు..



మద్యం, ఇసుక విషయాల్లో టిడిపి నాయకులు జోక్యం చేసుకోకూడదని ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హెచ్చరించినా తముళ్ల తీరు మాత్రం మారడం లేదు. మద్యం దుకాణాలపై తెలుగు తముళ్ల దౌర్జన్యం కొనసాగుతోంది. ప్రయివేటు మద్యం దుకాణాల నిర్వాహకులపై టిడిపి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దుకాణంలో వాటా ఇవ్వకుంటే తెరుచుకోనివ్వమని హెచ్చరిస్తున్నారు. పలువురు టిడిపి నాయకులపై దుకాణదారులు ఇప్పటికే అధిష్టానికి ఫిర్యాదు చేశారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మంచి లాభాలు ఉన ప్రయివేటు మద్యం దుకాణాలపై తెలుగు తమ్ముళ్ల కన్ను పడింది. దుకాణాలకు దక్కించుకునేందుకు ముందు నుంచే విశ్వప్రయత్నాలు చేశారు. లాటరీలో దుకాణం రాకుంటే ఇతర మార్గాల్లో దుకాణాలను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అప్పటికీ కుదరకపోతే దుకాణంలో వాటా ఇవ్వాలని దుకాణదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలను, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలను, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 204 మద్యం దుకాణాలను ఈ నెల 14న లాటరీ ద్వారా కేటాయించారు. 16 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. ఆ లాటరీల్లో తెగులు తమ్ముళ్లకు దుకాణాలు అంతంత మాత్రమే దక్కాయి. దీంతో కొందరు టిడిపి నాయకులు మాత్రం అధికారం మాది...మద్యం దుకాణాలు కూడా మావే అంటూ విర్రవీగుతున్నారు. కొన్ని చోట్ల 30 శాతం వాటా ఇచ్చేందుకు దుకాణదారులపై బెదిరింపులకు పాల్పడి దుకాణాలు తెరుచుకునేందుకు రాజకీయ అనుమతినిచ్చారు. వాటాకు ఒప్పుకోకుంటే దుకాణాన్ని తెరుచుకునేందుకు అనుమతి ఇవ్వడం లేదు. కొన్ని ప్రాంతాల్లో టిడిపి వారే దుకాణాన్ని దక్కించుకున్నా తమ వర్గం వారు కాకపోవడంతో దుకాణాల నిర్వహణను అడ్డుకుంటున్నారు. దీంతో ఆదివారం నాటికి పత్తికొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు మద్యం దుకాణాలు, కోడుమూరు స్టేషన్ పరిధిలో రెండు దుకాణాలు, నందికొట్కూరు, కర్నూలు, ఎమ్మిగనూరు స్టేషన్ల పరిధిలో ఒక్కో దుకాణం చొప్పున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు దుకాణాలు తెరుచుకోలేదు. మద్యం, ఇసుకలో జోక్యం చేసుకోవద్దని ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు అధినేత చంద్రబాబు నాయుడే స్వయంగా హెచ్చరించినా తమ్ముళ్ల తీరు మాత్రం మారడం లేదు. కర్నూలు జిల్లా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ కుమారుడికి కర్నూలు మండల పరిధిలో మద్యం దుకాణం అనుమతి దక్కింది. కర్నూలు మండలం వెంకాయపల్లె పరిధిలో సిటీ వైన్స్ పేరుతో ఆయన దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. కోడుమూరు నియోజకవర్గానికి చెందిన ఓ టిడిపి నేత రౌడీలను పంపి దుకాణాన్ని బలవంతంగా మూయించారని సదరు నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు మండల పరిధిలో అనుమతి దక్కించుకున్న ఓ యువకుడికి దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు టిడిపి నాయకులు రాజకీయ అనుమతి ఇవ్వకపోవడంతో టిడిపి నేతలకు దుకాణాన్ని అప్పగించేసినట్లు సమాచారం. కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు దుకాణాలను దక్కించుకున్న తెలంగాణకు చెందిన మహిళకు ఓ టిడిపి నేత రాజకీయ అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. రెండు దుకాణాల్లోనూ భాగస్వామ్యం ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో ఆ మహిళ దిక్కుతోచని పరిస్థితిలో ఉందని సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి కోడుమూరు పరిధిలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి దక్కింది. ఓ టిడిపి నేత దుకాణం ఏర్పాటు చేసుకోనీయకపోవడంతో విజయవాడలో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొత్తం మద్యం వ్యాపారాన్ని దక్కించుకోవాలని ప్రయత్నాల్లో టిడిపి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతుండటంతో ప్రజల్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ఈ తతంగంలో తెలుగు తమ్ముళ్ల వ్యవహార తీరు పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చిందని చర్చ సాగుతోంది.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- పోలీస్ అమరవీరుల స్థూపానికి కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్‌పి నివాళులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సంధర్బంగా సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ అన్ని వ్యవస్థల కంటే పోలీసు వ్యవస్థలో పని చేయడం చాలా కష్టతరం, 24 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఫైర్, ఏదైనా ప్రాణ నష్టం జరిగినప్పుడు వెంటనే స్పందించేది పోలీసులేనన్నారు. ప్రజల, ధన, మాన, ప్రాణాలను కాపాడడంలో ఎటువంటి సంకోచం లేకుండా పోలీసులు ముందుకు వెళతారని, అటువంటి పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకోవడం, అమరులకు నివాళులు అర్పించడం మనందరి భాధ్యత అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి మాట్లాడుతూ మనకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల ధైర్యసాహసాలు, దేశభక్తి, విధేయతలను గుర్తుంచుకుంటామన్నారు. గౌరవిస్తామన్నారు. దేశ, రాష్ట్ర, సరిహద్దు అంతర్గత భద్రత రక్షణలో పోలీసులు ప్రతిరోజూ సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. పోలీసుల త్యాగాలు రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తుందన్నారు. ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ ఒకరి కోసం చేసే త్యాగం ఉన్నతమైనదైతే ప్రజారక్షణ కోసం చేసే త్యాగం మహోన్నతమైనదన్నారు. దేశ, రాష్ట్ర భద్రతకు పోలీసులు పగలనక, రాత్రనక విధి నిర్వహణలో ప్రజల శ్రేయస్సుకై ప్రాణాత్యాగం చేస్తున్నారన్నారు. అమరవీరులను ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుంటూ పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి కష్టాలకు అండగా నిలబడుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 216 మంది పోలీసుల పేర్లను ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ చదివి వినిపించగా, వారందరికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అమర వీరుల కుటుంబాలను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జెసి డాక్టర్ బి.నవ్య, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, డిఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాస రావు, పోలీసు వేల్ఫేర్ డాక్టర్ స్రవంతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల

ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ కోరారు. కర్నూలు నగరంలోని 19, 20వార్డు కమిటీ ఆధ్వర్యంలో సోమిశెట్టి నగర్‌లోని యుటిఎఫ్ ఆఫీస్‌లో సిపిఎం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు సుంకన్న, సుబ్బరాయుడు విప్లవ గీతాలు ఆలపించి సభను ఉత్తేజపరిచారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ భారతదేశంలో బిజెపి మూడోసారి ప్రతిపక్షాల సపోర్టుతో అధికారం చేపట్టి ఉద్యోగ, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను చేయాలని చూస్తున్నదని చెప్పారు. కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా చేసి కార్మికులకు వ్యతిరేకంగా యజమానులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నదని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని కాపాడుకోవడం కోసం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచి నాలుగు నెలలు కావస్తున్నా ఇచ్చిన మాటకు, చేసే పనికి పొంతన లేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. స్త్రీలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే వాటిని కంట్రోల్ చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. వార్డుకు కార్పొరేషన్ మేయర్ ప్రజాప్రతినిధిగా ఉన్నా వార్డు సమస్యలు పట్టించుకోవడం లేదని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఈ పోరాటానికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం వార్డు కార్యదర్శి బి.రాధాకృష్ణ, వార్డు నాయకులు జయన్న, సతీష్, చిన్న మాలిక్, పెద్దబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం

- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి : యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో ఎస్‌టిఎఫ్ఎస్ఐ జెండాను కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.సురేష్ కుమార్ మాట్లాడారు. యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటం చేశామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం పోరాడినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు, విద్యారంగానికి ఉపయోగపడే ఏ శిక్షణనైనా యుటిఎఫ్ స్వాగతిస్తుందని తెలిపారు. అనవసర యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పని సర్దుబాటు లోప భూయిష్టంగా ఉందని, ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చి ప్రతేడాది బదిలీలు, ప్రమోషన్లు ఉండేలా చేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, రూ.3.50 కోట్లు మాత్రమే తీర్చారని చెప్పారు. పిఆర్‌సి కమిషన్ వేయాలని, అప్పటి లోపు ఐఆర్ సాధించుకోవాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి, జిల్లా పూర్వ అధ్యక్షులు జె.ఎల్లప్ప మాట్లాడుతూ జిఒ 117పై ఏ సంఘం నోరు మెదపకపోతే యుటిఎఫ్ ఆందోళన చేసిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే పేద విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు విక్టోరియమ్మ, విజయకుమారిని సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న, వై.రామాంజనేయులు, నాయకులు రాఘవేంద్ర, ఎం.నాగరాజు, ఎం.భీమేష్, ఎం.రాజు, సుధాకర్, పరిగె ప్రకాష్, కె.శివకుమార్, ప్రశాంత్, భూపాల్, పి.గురుస్వామి, ప్రసాద్, కె.లక్ష్మన్న, పెద్దారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే, వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



ఆర్థికసాయం అందజేస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటామని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు పందిపాడులో కంసలి వీధికి చెందిన ఉగ్గన్న అనే వ్యక్తి వ్యాపారం కోసం శ్రీశైలం నుంచి వస్తుండగా ఘాట్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందారు. సోమవారం గ్రామ నాయకుల సమక్షంలో మృతుని కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. 28వ వార్డు కార్పొరేటర్ ఇప్పల నారాయణరెడ్డి, కె.భీమేశ్వర రెడ్డి, శివశంకర్ రెడ్డి, తిరుమలేష్ గౌడ్, చిన్న సుంకన్న, బాలు, శేషు పాల్గొన్నారు.

'పగలు పాములు, రాత్రి దోమలు'

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలోని రేడియో స్టేషన్, వీకర్ సెక్షన్ కాలనీ మధ్యనున్న శాంతినగర్ కాలనీలో పగలు పాములు, రాత్రి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. సోమవారం అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పి.మల్లికార్జున, స్వామి నాయక్, లక్ష్మమ్మ, ఖాజాబీ, రమాదేవి మాట్లాడారు. మురుగు కాలువలు లేకపోవడతో చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరు, వర్షపు నీరు కలిసి కాలనీ చిన్నపాటి చెరువులా తయారైందని తెలిపారు. రిలయన్స్ గోడౌన్ నుంచి కిలోమీటరుకు పైగా రూ.కోటితో మనిషి లోతు నిర్మించిన భారీ మురుగు కాలువ నిరుపయోగంగా మారిందన్నారు. తమ ఇళ్ల ముందు కాలువలు నిర్మించి పెద్ద మురుగు కాలువలో కలపాలని కోరారు. కంప చెట్లు పెరిగి రోడ్డుపై నీరు నిలిచిన ఫొటోలను అదనపు కమిషనర్ చూపించారు. తమ కాలనీలో పర్యటించి రోడ్లు మురుగు కాలువ సమస్య పరిష్కరించాలని కోరారు. కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. రాఘవేంద్ర, జితేంద్ర ఆచారి, శ్రీనివాసులు ఉన్నారు.

ముళ్లపొదలను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 39, 40వ వార్డు పరిధిలో ఉన్న మమతా నగర్ ప్రాంతంలో విద్యుత్ తీగలకు అల్లుకుపోయిన ముళ్ల పొదలను తొలగించాలని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, వార్డు కార్యదర్శి పి.దేవన్న, దావీదు, ఆదాము, రఘు, బాష కోరారు. సోమవారం ట్రాన్స్‌కో వెంకటరమణ కాలనీ డివిజన్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడారు. మమతా నగర్‌లో దాదాపు సంవత్సర కాలంగా విద్యుత్ తీగలకు చెట్లు అల్లుకుపోయి పొదలు ఏర్పడి ప్రజలు భయాందోళనకు గురవుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచు కోవడం లేదన్నారు. ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వీడి, విద్యుత్ తీగలకు అల్లుకుపోయిన ముళ్ల పొదలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరుగుతే మమతా నగర్‌లో ఉండే పేదల ఇళ్లు దగ్ధమయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిఇ, ఎస్ఇ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎఇ స్పందిస్తూ... సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'పరిష్కార వేదిక'

- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. సోమవారం కల్లూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను ఎంపిడిఒ జిఎస్ఎస్.రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల నుంచి వచ్చిన సుమారు 113 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు అందించారని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చాయని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తుల ను పరిశీలించే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. తహశీల్దార్ కె.ఆంజనేయులు, ఇఒఆర్‌డి నాగేష్, పరిపాలనాధికారి ప్రమీల రాణి, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు పాల్గొన్నారు. **మద్దికెర** ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హౌసింగ్ పెండింగ్ బిల్లులు, భూముల, పొదుపు మహిళలు, విద్యుత్ అగ్రికల్చర్, పోలీసు శాఖ, పంచాయతీ రాజ్, శాఖల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం చేస్తామని చెప్పారు. ఎంపిపి అనిత యాదవ్, టిడిపి జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఎంపిడిఒ కొండయ్య, సర్పంచి ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పన్నులు చెల్లించి అభివృద్ధికి పాటుపడండి

- నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించి, అభివృద్ధికి పాటుపడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ప్రజలను కోరారు. ఈ నెల 17 నుండి రెవెన్యూ విభాగం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ.94,53,000 లక్షల పన్నులను రెవెన్యూ విభాగపు అధికారులు వసూలు చేశారు. అధికారులు ఆ వివరాలను అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి కమిషనర్‌కు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో పన్నులు ఎంతో కీలకమని, దీనిని గ్రహించి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషకరమన్నారు. ఈ నెల 17 నుండి 20వ తేదీ వరకు ఆస్తి పన్నులు రూ.89,25,000 నీటి పన్నులు రూ.5,28,000 మొత్తం రూ.94.53 లక్షల పన్నులను, ఇటీవలే నియమితులైన నూతన సిబ్బంది వసూలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. పన్ను వసూళ్లలో నగరపాలక వృద్ధి సాధిస్తుందని, నగరాబివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఇంకా పన్నులు చెల్లించనివారు cdma.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా సంబంధిత సచివాలయాల ద్వారా త్వరగా పన్నులను చెల్లించాలని కోరారు. ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, ఆర్ఐలు ఎస్.శేషాద్రి, ఎం.రాజు, ఎస్.తిప్పన్న, పి.భార్గవ, ఎం.నాగరాజులను కమిషనర్, అదనపు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

సమాజం పట్ల అవగాహన అవసరం

- పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య

ప్రజాశక్తి - పత్తికొండ

సమాజంలో జరుగుతున్న పరిణామాలపై కలిగి ఉండాలని విద్యార్థులకు పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య సూచించారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భ్రమరాంబ అధ్యక్షతన పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య, ట్రైనీ డిఎస్‌పి ఉషశ్రీ, అర్బన్ సీఐ జయన్న హాజరయ్యారు. డిఎస్‌పి వెంకటరామయ్య మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు పోలీసులు విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు. పోలీసులు-సమాజ భద్రత అనే వ్యాసరచనలు పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఎమ్మెల్యే బొగ్గుల పరామర్శ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్త యశోదమ్మను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సోమవారం ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. గత కొద్ది రోజులుగా ఆమె క్యాన్సర్ వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకొన్న ఎమ్మెల్యే దస్తగిరి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పింఛను రివిజన్ చేయాలి

- బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు జనవరి 1, 2017 నుంచి వేతన సవరణతో సంబంధం లేకుండా 15 శాతం ఫిట్‌మెంట్‌తో పెన్షన్ రివిజన్ చేయాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కెకె భవన్‌లో ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఎ.రామలింగం అధ్యక్షత వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబ్, జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్, సర్కిల్ సహాయ కార్యదర్శి జి.మహేశ్వరరావు, జిల్లా కోశాధికారి ఎస్‌కె.ఖాజామొద్దీన్ పాల్గొని మాట్లాడారు. 65 ఏళ్లకు 5 శాతం, 70 ఏళ్లకు 10 శాతం, 75 ఏళ్లకు 15 శాతం అదనపు పెన్షన్ ఇవ్వాలని కోరారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ ఆస్పత్రిని కర్నూలులో నెలకొల్పాలని కోరారు. 80 ఏళు పడగానే అదనపు పెన్షన్ 20 శాతం ఇవ్వాలని తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కె.షబ్బీర్, నంద్యాల బ్రాంచి కార్యదర్శి సామ్యేల్, కడప జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య, బి.విజయలక్ష్మి, రత్నమ్మ, లలితమ్మ, బేగం, సోను బాయ్, బాలసుబ్బమ్మ పాల్గొన్నారు.

అర్జీలు రీ ఓపెన్ కాకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు మళ్లీ రీఓపెన్ కాకుండా వెంటనే వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 36 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులను సంబంధిత శాఖలపై అధికారులు పరిశీలించి వారి ఎండార్స్మెంట్‌ను అప్లోడ్ చేయాలని సూచించారు. సిఎం కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు 30 పెండింగ్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఓ చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అందజేత : ముగ్గురు వికలాంగులకు టచ్ ఫోన్స్, ఒకరికి ల్యాప్ టాప్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

- నేవా యూత్ అసోసియేషన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమిష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని నేవా యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం బళ్లారి చౌరస్తా సమీపంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ జిల్లాలో 50 గ్రామాలను ఎంపిక చేసుకొని బాల్యవివాహాలు జరగకుండా చూసే బాధ్యత తీసుకొని పనిచేస్తుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి వారి తల్లిదండ్రులకు, పెళ్లి చేసుకునేకి వారి కూడా బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు వినని పక్షంలో పోలీసుల సహకారం తీసుకుంటామని తెలియజేశారు. తరచూ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 2023 - 24 సంవత్సరంలో 59 బాల్యవివాహాలను, 21 మందిపై లైంగిక వేధింపులను ఆపామని తెలిపారు. 48 మందిని బాల కార్మికులను గుర్తించి వారికి విద్యాబుద్ధులు నేర్పే విధంగా పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 2024- 25 సంవత్సరానికి గాను 14 బాల్యవివాహాలు జరగకుండా ఆపామన్నారు. సమావేశంలో ఆ సంస్థ సిఈఓ యు.నరసింహులు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ జె.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

రాజకీయాలకతీతంగా అభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. సోమవారం ఆలూరులో ఉరుకుంద ఈరన్న కొట్టాలలో ఎంపిపి నిధులు రూ.6 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే విరుపాక్షి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయం, పంతాలు, పట్టింపులను పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అందుబాటులో ఉండి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపిపి జె.రంగమ్మ తనయుడు జె.వీరేష్, ఎంపిటిసి మోతి ఎల్లమ్మ, బోయ ఎల్లమ్మ, వైసిపి మండల కో కన్వీనర్ వీరేష్, వార్డు సభ్యులు జీర గౌడ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - కౌతాళం


వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఇటీవల వర్షానికి దెబ్బతిన్న పంటలను తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎఒ శేషాద్రి పరిశీలించారు. సోమవారం తుంగభద్ర నదీతీరంలోని నదిచాగి, మేళిగనూర్ గ్రామాల పరిధిలోని వరి పంటను పరిశీలించారు. నేల వాలిన వరి పంటను కాపాడుకోవడానికి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని అధికారులు తెలిపారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు ఎరువులను, నీళ్ల మందులను అధిక ధరలకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని ఎఒ జయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం చిప్పగిరిలో ఉన్న పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. లిక్విడ్ మందులను, ఎరువులను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు నాణ్యతతో కూడిన ఎరువులను, మందులను ఇవ్వాలని, తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. రైతులు కూడా ఏది కొన్నా తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఏదైనా మందు సరిగా పని చేయకపోతే రసీదు ఉంటేనే మాట్లాడటానికి, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు బ్యానర్‌ను విడుదల చేసి సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ సిబ్బంది ప్రతాప్ నాయుడు, రంగస్వామి, రాకేష్, బాష, కుమార్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

డిటిగా విష్ణు ప్రసాద్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల డిప్యూటీ తహశీల్దార్‌గా ఆర్.విష్ణు ప్రసాద్ సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కుమారస్వామి, విఆర్‌ఒలు, సర్వేయర్లు ఆయనకు స్వాగతం పలికారు. డిటి మాట్లాడుతూ... గతంలో తాను పత్తికొండ, దేవనకొండ, క్రిష్ణగిరి మండలాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, తహశీల్దార్, తమ సిబ్బంది సహకారంతో వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.

'చంద్రన్న మదర్సా నవీన విద్య' హర్షణీయం

-ముస్లిం, మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

ముస్లిం, మైనార్టీల విద్యార్థులకు మేలు చేకూరేలా చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం అమలు చేయడం హర్షణీయమని ముస్లిం, మైనార్టీలు తెలిపారు. సోమవారం టిడిపి ముస్లిం, మైనార్టీ నాయకులు అబ్దుల్ సుభాన్, సిబిఎన్ ఆర్మీ మోయిన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం ద్వారా రాష్ట్రంలోని గుర్తింపు పొందిన 185 మదర్సాలలో విద్యా వాలంటీర్ల నియామకం చేపట్టి ముస్లిం, మైనార్టీల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ భాష ఉపాధ్యాయులను, విద్యా వాలంటీర్లను నియమించడం ద్వారా విద్యార్థులకు మేలు చేకూరుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ముస్లిం, మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఫరూక్‌కు, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అబ్దుల్ రెహమాన్, సుభాన్, కైసర్, అమీన్, మౌలానా షాకీర్, తన్వీర్, అబుజర్, ఇస్మాయిల్, సలీం, అల్తాఫ్ పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డాక్యుమెంటేషన్ రద్దు చేయించాం
- వైసిపి నాయకులు ఏనాడైనా చేయించారా : కూటమి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎవరైనా భూకబ్జాలకు, దౌర్జన్యాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, రాష్ట్ర కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, సీనియర్ నాయకులు ఫక్రుద్దీన్‌తో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో అక్రమ మార్గంలో స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ స్థలం డాక్యుమెంట్లు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చి 48 గంటల్లోనే డాక్యుమెంటేషన్ రద్దు చేసేలా చూశామని తెలిపారు. అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్టర్ రవికిరణ్‌పై పోలీసు కేసు నమోదు చేయాలని అధికారులను కోరామన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో భూ కబ్జాలు జరిగాయని, ఒక్కరి కూడా న్యాయం జరిగిన దాఖలాలు లేవని తెలిపారు. తెలుసుకోకుండా తమపై బురద జల్లడం వైసిపి నాయకులకు తగదన్నారు. ఎన్‌జిఒ హోమ్ స్వాధీనం గురించి ఉద్యోగులు సాయి ప్రసాద్ రెడ్డికి వ్యతిరేకంగా ఉద్యమం చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. బసాపురం రెవెన్యూ పరిధిలోని 112సిలో 66 ఎకరాలు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కబ్జా చేశారని తెలిపారు. అమరావతి నగర్‌లో పేద ముస్లింల భూమిని సాయి ప్రసాద్ రెడ్డి వారసులు ఆక్రమించుకున్నారని గుర్తు చేశారు. ఆరోపణ వచ్చిన ఏనాడైనా సెంటు స్థలం బాధితులకు ఇప్పించారా అంటూ నిలదీశారు. ఎవరినైనా భయపెట్టినా, తమ పేరు చెప్పి భూ కబ్జాలకు పాల్పడినట్లు సమాచారం ఇస్తే న్యాయం చేస్తామన్నారు. వైసిపి హయాంలో భూ కబ్జాలు జరిగాయని తమ దృష్టికి వస్తున్నాయని, బాధితులు వస్తే ఆ స్థలాలు కూడా ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథికి డాక్టర్ రవికిరణ్ స్నేహితుడేనని, ఆయన చేసిన కబ్జాలో ప్రమేయం ఉందని ఆరోపణలు చేయడం తగదన్నారు. వాస్తవాలు తెలుసుకొని విమర్శలు చేయాలని హితవు పలికారు. నాయకులు కునిగిరి నీలకంఠ, నాగరాజు, ఉపేంద్ర ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

డాక్టర్ రవికిరణ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆదోని




స్థలాన్ని కబ్జా చేసి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించిన డాక్టర్ రవికిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదోని టూ టౌన్ సిఐ సూర్య మోహన్ రావు తెలిపారు. సోమవారం బాధితులు కురువ రాజశేఖర్, హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ రవికిరణ్, అతని తల్లి జయలక్ష్మి, రిజిస్ట్రేషన్ చేయించుకున్న సురేష్ బాబు, సాక్ష్యులుగా సంతకాలు పెట్టిన చంద్రప్ప, రవికుమార్, డాక్యుమెంట్ రైటర్ రవిపై కేసు నమోదు చేశామన్నారు. చీటింగ్, ఫోర్జరీకి పాల్పడినట్లు కేసు నమోదు చేశామని తెలిపారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజాదర్బార్'

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే 'ప్రజాదర్బార్'ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కుర్ని కల్యాణ మండపంలో మండల ప్రజలకు ప్రజాదర్బార్ నిర్వహించారు. దాదాపు 300 మంది వివిధ రకాల సమస్యలపై వినతులను బీవీకి అందజేశారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి నెలా 'ప్రజాదర్బార్' నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇళ్ల స్థలాలు, భూములు, పెన్షన్లు, రేషన్ కార్డులు, తాగు, సాగునీటి సమస్యలపై ఎక్కువ వినతులు వచ్చినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో రైతుల భూములు కొలతలు హెచ్చుతగ్గులు చేశారని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ సమస్యలను పరిశీలించి నాన్ ఫైనాన్స్ సమస్యలను వచ్చే నెలలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడిపి నాయకులు వాల్మీకి శంకరయ్య, గొల్ల మల్లికార్జున, బోయ కేశన్న, కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, అయ్యాలప్ప, సురేష్ చౌదరి, జగదీష్, రాఘవేంద్ర, అశోక్, కెటి.వెంకటేష్, చాకలి ఉరుకుందు, బోడబండ వెంకటరాముడు, దేవదాసు, మసీదుపురం రాఘవేంద్ర, నాగరాజు, తెలుగు ఆంజనేయ, బోయ వీరేష్, వీరనాగప్ప పాల్గొన్నారు.

'స్కావెంజర్ల వేతనాలు చెల్లించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్ల వేతనాలను చెల్లించాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు వేతనాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంఇఒకి వినతిపత్రం అందజేశారు. స్కావెంజర్లు వరలక్ష్మి, షాహిన్, పద్మావతి, యుఎం.కవిత, సుజాత, లక్ష్మి, జయశ్రీ, షబానా, రాజమ్మ, జాహీద్, లక్ష్మి, ఫాతిమా, నరసింహులు, సిఐటియు నాయకులు సి.నారాయణ పాల్గొన్నారు.

'కబ్జా'పై నిగ్గు తేల్చాలి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఎస్‌కెడి కాలనీలోని ఒక లేఅవుట్ స్థలం కబ్జాకు పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్రమంగా ఒక ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకో వడంపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవా లని కోరారు. ఆధార్ కార్డులు మార్ఫింగ్ చేసి విలువైన స్థలాన్ని కొట్టేయాలని ఈ పనికి ఒడిగట్టారన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పిఎగా చెప్పుకుంటున్న దంత వైద్యుడు డాక్టర్ రవికిరణ్ కొత్త తరహా మోసానికి పాల్పడ్డారని తెలిపారు. కబ్జాలకు పాల్పడిన రవికిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అతనికి సహకరించిన రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఉద్యోగులను విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ దోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పట్టణ మాజీ అధ్యక్షులు సాయినాథ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు శ్రీనిత్, రామకృష్ణా రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ప్రజాదర్బార్'లో సమస్యలు పరిష్కరించుకోవాలి

- మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం



'ప్రజా దర్బార్ 'కార్యక్రమంలో పాల్గొని ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం నందవరంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు హాజరు కావాలని కోరారు. సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు సమర్పించి పరిష్కరించుకోవాలని తెలిపారు.

సుంకేసుల నుండి సింగవరం రోడ్డుకు కొత్త శోభ

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని సుంకేసుల నుండి కే సింగవరం వరకు వేసిన విస్తరణ రోడ్డుతో కొత్త శోభ సంతరించుకొంది. సుంకేసుల నుండి గుండ్రేవుల వరకు 14.5 కిలోమీటర్లు మేర విస్తరణ పనులకు ప్రభుత్వం గత ఏడాది ఆర్ అండ్ బీ నిధులు, నాబార్డు నిధులను మంజూరు చేసింది. గత రెండు రోజులలో గుతేదారులు గ్రావెల్ పనులు పూర్తి చేశారు. సుంకేసుల నుండి కే సింగవరం వరకు సుమారు ఆరు కిలోమీటర్లు బిటి రోడ్డును వేశారు. డబుల్ రోడ్డుగా కొత్త శోభ సంతరించుకోగా అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రోడ్డు పనులను కూడా వేగవంతం చేసి పూర్తి చేస్తే గమ్యం క్షేమంగా చేరొచ్చని అంటున్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని బీసీ బాలుర హాస్టల్, బీసీ మేనేజ్‌మెంట్ కళాశాల బాలుర హాస్టల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్, ఐద్వా మండల అధ్యక్షులు షేకున్‌బీ మాట్లాడారు. ఆలూరులోని అరికెర రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు వందమందికి పైగా, బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల బాలుర హాస్టల్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ హాస్టళ్లకు దగ్గరలో నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. గుడి, బడి పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఒకవైపు మద్యం, మత్తు పదార్థాలపై కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రభుత్వం, అధికారులు అవగాహన కల్పిస్తూ సెమినార్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యాసంస్థల పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడం 'మద్యానికి బానిసలు అవ్వండి' అంటూ ప్రోత్సహించి వారి జీవితాలను నాశనం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని, లేకపోతే విద్యార్థులు, ప్రజాసంఘాలతో కలిసి మద్యం దుకాణాన్ని ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ గోవింద్ సింగ్, ఎక్సైజ్ సిఐ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 24లోపు హాస్టల్ పరిధిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించి విద్యాసంస్థల పరిధిలో ఎక్కడా ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని వారు హామీఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సిఐటియు నాయకులు కృష్ణ మద్దతు తెలియజేశారు. ఐద్వా నాయకులు గౌసియా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు షఫీ, మహేష్, బసవరాజు, చంద్ర, బొటయ్య, తిరుమలేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోనికి బస్సు సౌకర్యం కల్పించాలి

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శాంతికుమార్

ప్రజాశక్తి - దేవనకొండ



దేవనకొండ నుంచి ఆదోనికి బస్సు సర్వీసు నడిపించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్ కోరారు. సోమవారం ఎపిఎస్ ఆర్‌టిసి కర్నూలు రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 44 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. రైతులు పంట ఉత్పత్తులు అమ్మడానికి, వ్యాపారులు, వ్యక్తిగత పనులను నిమిత్తం మండల ప్రజలు నిత్యం ఆదోనికి రాకపోకలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువుల నిమిత్తం విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఆటోలో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. మండల ప్రజల విజ్ఞప్తి మేరకు దేవనకొండ నుంచి ఆస్పరి మీదుగా ఆదోనికి రోజూ అప్ అండ్ డౌన్ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

స్పందనకు 7 వినతులు

ప్రజాశక్తి - సి బెళగల్

తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, అధికారుల సమక్షంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన మొత్తం ఏడు వినతులు వచ్చినట్లు తెలిపారు. అందులో భూ సమస్యలు, రస్తాలు, ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలని పలువురు బాధితులు వినతులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి సోమవారం స్పందన వినతులకు పరిష్కరించాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని తహసీల్దార్ కోరారు.

రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు

- వాహనదారులు ఇబ్బంది

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలిలోని రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి కింద నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. వాహనదారులు నీటిలో జారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. బ్రిడ్జి కింద నీరు నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు.

ఏజెంట్లపై నిర్లక్ష్యం తగదు

- ఎల్ఐసి కార్యాలయం ముందు నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఎల్ఐసి పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ఏజెంట్లను నిర్లక్ష్యం చేయడం తగదని లియాఫీ ప్రెసిడెంట్ జయభారత్ రెడ్డి, ఆదోని అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సిద్ధలింగ తెలిపారు. సోమవారం ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కమీషన్ తగ్గింపును విరమించాలని, పాత కమీషన్ పద్ధతిని అమలు చేయాలని కోరారు. పాత కమీషన్ పద్ధతిని పునరుద్ధరించి ఏజెంట్ల ఆర్థిక ప్రగతికి దోహదపడాలని తెలిపారు. పాలసీదారులకు బోనస్ తగ్గించడం తగదన్నారు. కనీస బీమా మొత్తం రూ.లక్షకు తగ్గించి సామాన్యులకు కూడా అందుబాటులో ప్రీమియం ఉండేలా చూడాలని కోరారు. పెంచిన ప్రీమియం రేట్లను తగ్గించాలని తెలిపారు. ఏజెంట్లు ఈరన్న, రఘు, తిప్పన, ప్రభాకర్ ఉన్నారు. **ఎమ్మిగనూరు** బ్రాంచి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. లియాఫీ కడప డివిజన్ అధ్యక్షులు జయభారత్ రెడ్డి, బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, ఆర్థిక కార్యదర్శి వీరేష్, జోనల్, డివిజన్ నాయకులు రమేష్, ఆంధ్రయ్య, సోమన్న, అనంత భూరళి, మధు, ప్రభాకర్, సూర్యకాంత్ రెడ్డి, హరి, సుభాన్, ప్రసాద్, ఆనందయ్య శెట్టి, దేవేంద్ర మూర్తి పాల్గొన్నారు.



ఆదోనిలో నిరసన తెలుపుతున్న ఏజెంట్లు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న జయభారత్ రెడ్డి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

చర్చి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎంబి ఎరుషాలేం చర్చి నుంచి ఖబరిస్తాన్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, స్థానిక టిడిపి నాయకులు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడారు. కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణ పనుల కోసం దళితులు ఎదురుచూస్తున్నారని, వారి కల సాకారమైందని తెలిపారు. గత పాలకులు ఎస్సీ కాలనీ అభివృద్ధిని విస్మరించారని ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి నేడు నెరవేర్చారన్నారు. ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు కె.శాలేం, 7వ వార్డు కౌన్సిలర్ ఎరుకుల సుంకమ్మ కుమారుడు ఎరుకుల సూర్యనారాయణ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధి అవసరం : ఎఒ

ప్రజాశక్తి- దేవనకొండ

పంట విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని ఎఒ సురేష్‌బాబు కోరారు. సోమవారం మండలంలోని ఐరన్ బండ గ్రామంలో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో వేరు శనగ పంటలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా విరిడి 50 కిలో విత్తనాలకు కిలో చొప్పున విత్తనశుద్ధి చేసుకుంటే పైరుకు తెగులు రాదన్నారు. 20 రోజుల పంట కాలంలో వేప నూనె 2.5 మిల్లీలీటర్లు లీటర్ నీటికి, ఆసేపేట్ 2.5 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలుపుకొని స్ప్రే చేసుకోవాలని తెలిపారు. వేరుశనగ పంటలో విత్తిన 35 రోజుల తర్వాత ఎకరాకు 100 కిలోల జిప్సం పంటపైన చల్లుకోవాలన్నారు. ఆకుపచ్చ పురుగు, లద్దెపురుగు ఎక్కువగా వస్తుందని, నివారణకు క్లోరో పెరిపాస్ 2.5 మిల్లీలీటర్లు, మోనోపాస్ 2.0 ఒక లీటర్ నీటికి కలుపుకొని స్ప్రే చేయాలని తెలిపారు. సీడు విత్తన ఉత్పత్తి అధికారి చైతన్య కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి వి.రంగన్న, విఎఎలు నరసప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

అనాథ వృద్ధునికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గుర్తుతెలియని అనాథ వృద్ధునికి అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం మల్లెల గ్రూపు అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, డాక్టర్ కామళే గణేష్, పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు యు.రాము, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ సింగనేటి నరసన్న, యుఎం.వెంకోబా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగావ వారు మాట్లాడారు. 65 ఏళ్ల అనాథ వృద్ధుడు పది రోజుల నుంచి ప్రభుత్వాస్పత్రిలో ఉంటున్నారని తెలిపారు. పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు నరసన్న, ప్రసాద్ అన్నదానం చేసేవారని చెప్పారు. ఆదివారం అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. పట్టణ సిఐ యు.రాము సింగనేటి నరసన్న దగ్గర రాతపూర్వకంగా అర్జీ తీసుకున్నారు. బీసీ శ్మశాన వాటికలో పోలీసులు, మున్సిపాలిటీ వారు అంత్యక్రియలు నిర్వహించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆదోని

అంది వచ్చిన అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మురళీ బాబు తెలిపారు. సోమవారం డాక్టర్ జ్యోతిర్మయ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేషనల్, మల్టీనేషనల్ కంపెనీల మానవ వనరుల అధికారులు, దాదాపు 30మందికి పైగా సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 1000 మందికి పైగా నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. నైపుణ్యాలు కలిగిన వారిని ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక కోసం ఇంటర్వ్యూలు చేస్తూ, వారికి తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ జాబ్‌మేళాను దిగ్విజయంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్.రఘు రామయ్య మాట్లాడుతూ... ఉద్యోగాలు పొందాలంటే స్కిల్ డెవలప్మెంట్ అవసరమని, ఆ నైపుణ్యత గల విద్యను తమ కళాశాలలో అందిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ స్వామినాథ్, 1 క్యూఎస్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు.


మాట్లాడుతున్న కరస్పాండెంట్ మురళీబాబు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి మండలం జొన్నగిరిలో గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగార్జున పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్‌ను కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. జొన్నగిరిలో ప్రధాన రహదారి పూర్తిగా గుంతలు పడిందన్నారు. రాత్రివేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందన్నారు. చాలా ఇళ్లలో మురుగుదొడ్లు లేక మహిళలు బహిర్భూమికి బయటకు వెళ్లాల్సి పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మురుగుదొడ్లు వెంటనే నిర్మించాలని కోరారు. జొన్నగిరిలో టిడిపికి అత్యంత మెజార్టీ వచ్చిందని తెలిపారు. గ్రామంలో ఫ్లోరైడ్ నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోలీసు అమరవీరుల దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సిఐ ఎ.గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. మిలిటరీ, పారామిలిటరీ పోలీసు విభాగాల్లో పనిచేసేవారు తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు అమానుల్లా బేగ్, షఫీ, మాజీ సైనికుడు సుధాకర్, గ్రామస్తులు ఎస్ఎన్.మహబూబ్ వలీ, జర్నలిస్టులు దండుఖాజా, అహ్మద్ హుస్సేన్, మునిస్వామి, గజేంద్రారెడ్డి పాల్గొన్నారు. **చిప్పగిరి**లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పి.వరదరాజులు అధ్యక్షతన శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సిఐ శ్రీనివాసులు నాయక్ సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక ఎస్ఐ సతీష్, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు. **వెల్దుర్తి** ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్ఐ మల్లికార్జున, పోలీసు సిబ్బంది ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో కలిసి సంస్మరణ స్తూపంతో ఉన్న ఫ్లెక్సీ తో పోలీస్ స్టేషన్ నుండి పాత బస్టాండ్ సర్కిల్‌లోని తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీగా నిర్వహించారు. అనంతరం అమరులైన పోలీసుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.


గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు